# అల్ఫోర్స్ పాఠశాలలో "ఎక్స్‌ప్లోర్ ది ప్రైడ్ ఆఫ్ ఇండియా" అవగాహన సదస్సు



కరీంనగర్, జనతా న్యూస్: విద్యార్థుల్లో దేశభక్తి భావనతో పాటు దేశాలపై విస్తృత అవగాహన పెంపొందించడం అవసరమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి తెలిపారు. వావిలాలపల్లి ప్రాంతంలోని అల్ఫోర్స్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన "ఎక్స్‌ప్లోర్ ది ప్రైడ్ ఆఫ్ ఇండియా" అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు దేశం, ప్రపంచ దేశాలపై అవగాహన కల్పించడం ద్వారా వారి జ్ఞానం విస్తరిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల విద్యా ప్రణాళికలో భాగంగా వివిధ సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తరగతుల్లో నేర్చుకున్న విషయాలను ఆచరణలో పెట్టి సృజనాత్మకంగా ఆలోచించాలని సూచించారు. విద్యార్థులు నేర్చుకున్న అంశాలను నిరంతరం విశ్లేషిస్తూ వాటిపై పట్టు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక అవగాహన పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో అనేక అవకాశాలు లభిస్తాయని, పోటీ పరీక్షల్లో కూడా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. దేశ స్వాతంత్ర్యానికి కృషి చేసిన నాయకుల చరిత్రను తెలుసుకోవడం ద్వారా స్ఫూర్తి పొందవచ్చని, ప్రతి విద్యార్థి నాయకుల గురించి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సుందరగిరిలో మంచినీటి సరఫరాపై సమీక్ష

**- వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళిక**

**- సర్పంచ్ జంగ శిరీష రమణారెడ్డి వెల్లడి**



చిగురుమామిడి,జనత న్యూస్: గ్రామ ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన మంచినీటిని అందించడమే లక్ష్యంగా సుందరగిరి గ్రామ పంచాయతీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. శనివారం స్థానిక సర్పంచ్ జంగ శిరీష ఆధ్వర్యంలో మంచినీటి సరఫరా వ్యవస్థపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిణి జ్ఞానేశ్వరితో కలిసి గ్రామంలోని నీటి వనరుల స్థితిగతులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.గ్రామంలోని బోరుబావులు, నీటి ట్యాంకులు, మోటార్లు, పైప్‌లైన్లు మరియు గేట్ వాల్వుల పనితీరును సమీక్షించిన సర్పంచ్, ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పనిచేయని మోటార్లకు తక్షణమే మరమ్మతులు చేయించాలని, పైప్‌లైన్ లీకేజీల వల్ల నీరు వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రామంలో కొన్ని ప్రాంతాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు అసంపూర్తిగా ఉండటం వల్ల నీటి సరఫరా అందడం లేదని గుర్తించిన ఆమె, ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామస్థులకు నీటి కొరత కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సర్పంచ్ ఈ సందర్భంగా తెలిపారు.గ్రామ పంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయం,ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అదే సమయంలో ప్రజలు కూడా బాధ్యతగా మంచినీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గొల్లెన సంపత్ కుమార్, ఉపసర్పంచ్ మేడబోయిన రాజు, వార్డు సభ్యులు దిలీప్ కుమార్, రాజాకృష్ణ, శ్రీనివాస్, రవీందర్, రాజేశ్వరి, ప్రియాంక, శిరీష, ప్రమీల, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈఎన్‌సిగా రమేశ్ బాబు నియామకం

**హైదరాబాద్,ఫిబ్రవరి7 :** ఎట్టకేలకు తెలంగాణ ప్రభుత్వం నీటిపారుదల శాఖ ఈఎన్సీని నియమించింది. గత నెలలో పదవీ విరమణ పొందిన అంజద్ హుస్సేన్ స్థానంలో ఓలేటి వెంకట రమేశ్ బాబును నియమించింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ నియమాకంపై ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వెంకట రమేశ్‌బాబుకు ఈఎన్‌సీగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆయన సూర్యాపేట, ఖమ్మం జిల్లాల చీఫ్ ఇంజినీర్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఇరిగేషన్‌లో ఈఎన్సీ(జనరల్) స్థానం అత్యంత కీలకం. గతంలో ఈ శాఖను 19 టెరిటో రియల్స్‌గా విభజించగా మైనర్, మీడియం, మేజర్ ప్రాజెక్టులన్నీ ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చి ఆయా చీఫ్ ఇంజినీర్లకే బాధ్యతలను అప్పగించింది. అన్ని విభాగాలపై పూర్తిస్థాయి నిర్ణయాధికారాన్ని ఈఎన్సీకే కట్టబెట్టింది. ఇరిగేషన్ శాఖ, డ్యామ్ సేఫ్టీకి సంబంధించి రాష్ట్రస్థాయి కమిటీల్లోనూ ఈఎన్సీకే పూర్తి అధికారాలున్నాయి. ఇప్పటివరకు ఈఎన్సీగా పనిచేసిన అంజద్ హుస్సేన్ జనవరి 31న విరమణ పొందారు. సాధారణంగా కీలకమైన స్థానం ఖాళీ అవుతుంటే ముందుగానే తాత్కాలికంగానైనా ఇన్‌చార్జిని నియమించడం పరిపాటి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వారం రోజులైనా భర్తీ చేయకపోవడం ఇటీవల చర్చనీయాంశంగా మారింది. అయితే ఈఎన్సీ జనరల్ స్థానం భర్తీ కాకపోవడానికి ప్రధాన కారణం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ మధ్య పేచీనే కారణమనే చర్చ జోరుగా వినిపిస్తున్నది.

# పని చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

**హుస్నాబాద్ అభివృద్ధే లక్ష్యం**

**కాంగ్రెస్ సంక్షేమ పాలనకు అండగా నిలవండి**

**హుస్నాబాద్‌లో మంత్రులు పొన్నం, తుమ్మల ప్రచారం**



హుస్నాబాద్,జనత న్యూస్:హుస్నాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.బుడగ జంగాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రజలు కోరిన విధంగా బుడగ జంగాల కమ్యూనిటీ హాల్‌ను పూర్తి చేస్తామని, రేషన్ షాపు, అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. హుస్నాబాద్ ఎమ్మెల్యే తనకు అత్యంత ఆప్తుడని, పని చేసే నేతకు ప్రజలు అండగా నిలవాలని అన్నారు. ఆర్టీసీ ఉచిత ప్రయాణ పథకానికి ఇప్పటివరకు రూ.10 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇది ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత ప్రాధాన్యం ఇస్తోందానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటికే రేషన్ కార్డులు మంజూరు చేసి, సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరఫున ఇంటింటికి తిరిగి ప్రచారం చేసి అభ్యర్థులను విజయం వైపు నడిపించాలని ఓటర్లను కోరారు.హుస్నాబాద్‌లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే మరిన్ని నిధులు తీసుకొచ్చి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.



# అభివృద్ధికి పట్టం కట్టండి.. కాంగ్రెస్‌ను గెలిపించండి

**హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి పిలుపు**



హుస్నాబాద్,జనత న్యూస్: హుస్నాబాద్ మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఈ అభివృద్ధి నిరంతరాయంగా కొనసాగాలంటే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో హుస్నాబాద్ పట్టణ ముఖచిత్రం మారుతోందని కొనియాడారు. మంత్రి సహకారంతో పట్టణంలోని మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయల నిధులు మంజూరయ్యాయని, గతంలో ఎన్నడూ లేని విధంగా రోడ్ల విస్తరణ, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని, ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గంపై చూపిస్తున్న ప్రేమాభిమానాల వల్లే హుస్నాబాద్‌కు విద్యా, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, 250 పడకల ఆసుపత్రి నుంచి ఇంజనీరింగ్ కాలేజీ వరకు అన్నీ సాధ్యమయ్యాయని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తేనే నిధుల వినియోగం పారదర్శకంగా జరుగుతుందని, వార్డులన్నీ మోడల్ వార్డులుగా మారుతాయని ఆయన స్పష్టం చేశారు. హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి పట్టణ ప్రజలను అభ్యర్థించారు.

# హుస్నాబాద్ మున్సిపల్‌పై గులాబీ జెండా ఎగరడం ఖాయం





**పనిచేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి మున్సిపల్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి**

**కేసీఆర్‌పై కుట్రలు సాగనివ్వం**

**మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్, ఎమ్మెల్సీ రవీందర్రావు**

హుస్నాబాద్,జనత న్యూస్:హుస్నాబాద్ పట్టణ ప్రజల సహకారంతో మున్సిపల్‌పై గులాబీ జెండా ఎగరడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్రావు ధీమా వ్యక్తం చేశారు. శనివారం సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని 3, 4, 5, 16 వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు, నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అలాంటి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు.

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, సాగు నీరు,తాగునీరు అందించి, పట్టణాలు,గ్రామాలు అనే తేడా లేకుండా అభివృద్ధి పరుగులు పెట్టించిన నాయకుడు కేసీఆర్‌పై మరకలు అంటించేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు.ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నించినందుకే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుతో పాటు బీఆర్ఎస్ నాయకులపై కమిషన్లు, కేసులు, నోటీసుల పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. ఇప్పటివరకు ఆ విచారణల ద్వారా ఏమి తేలిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.హుస్నాబాద్ మంత్రి పొన్నం ప్రభాకర్ అవసరానికి తగ్గట్లు రాజకీయాలు చేస్తారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు దగ్గరవుతూ ప్రేమాభిమానాలు నటించి, ఓట్లు పూర్తయ్యాక హైదరాబాద్‌కే పరిమితమవుతారని ఆరోపించారు. ఉచిత బస్సులు, రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని, మహిళలకు నెలకు రూ.2500, తులం బంగారం, స్కూటీలు, ఆసరా పింఛన్లు వంటి హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైందన్నారు. హుస్నాబాద్‌లో ఓటమి భయంతోనే మంత్రి పొన్నం ప్రభాకర్ బీఆర్ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా పనిచేసిన వారిని పార్టీలోకి తీసుకొని బీఆర్ఎస్ అభ్యర్థులను భయపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో గట్టి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపుతోనే హుస్నాబాద్ పట్టణం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రజలు మాయ మాటలు, గారడీ రాజకీయాలను నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని 20 వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

